వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల్లో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని సూచించారు.

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు



రొళ్ల మండలం ఆర్.వద్రహట్టిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గోరంట్లలోని రామాలయం వీధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

గోరంట్ల: పేదల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని రామాలయం వీధిలో గోరంట్ల సర్పంచ్ సరోజా బాయి నేతృత్వంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గృహసారథులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో హామీలు ఇచ్చి మోసం చేసినట్లు గుర్తు చేశారు. పేదల కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ని రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, మాజీ పట్టణ కన్వీనర్ మేదర శంకర, పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, సుధాకరరెడ్డి, రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సోముశేఖర్, చంద్రమౌళి, లక్ష్మీనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం కన్వీనర్ అభిలాష్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు.

రొళ్ల: ఆర్.వద్రహట్టి, హెచ్‌ఎంపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం సచివాలయాల కన్వీనర్లు బసవరాజు, తిమ్మరాజు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర గృహసారథులు, వలంటీర్లు, నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

గుడిబండ: దేవరహట్టి గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యంజారేగౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్ర, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు.



అమరాపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దృశ్యం



గుడిబండ మండలం దేవరహట్టిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

క్లుప్తంగా

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు



అలంకరణలో దుర్గాదేవి, వీరభద్రస్వామి

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకుని వీరభద్రస్వామి, దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కల్లుమర్రి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు

మడకశిరరూరల్: ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్ -14 ఫుట్‌బాల్, త్రోబాల్ బాల, బాలికల పోటీల్లో కల్లుమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు పీ చందన, నజీర్ ఈ నెల 21 నుంచి విశాఖపట్నంలో జరిగే అండర్- 14 ఫుట్‌బాల్ పోటీల్లో, 9వ తరగతి విద్యార్థిని బీ లిఖిత నంద్యాలలో జరిగే అండర్ -14 త్రోబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎం కృష్ణమోహన్‌రెడ్డి , ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుల సంక్షేమానికి కృషి



జెండా ఎగుర వేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని సింగిల్‌విండో అధ్యక్షుడు కొల్లప్ప తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద సహకార వారోత్సవాలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా రైతుల నుంచి 22.5 క్వింటాళ్ల రాగి కొనుగోలు చేసినట్లు తెలిపారు. క్వింటాలుకు రూ.3,846 మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. సొసైటీ ద్వారా రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ జయరాములు, డైరెక్టర్ నరసింహులు, సొసైటీ అధికారులు రవి, రామాంజనేయులు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సూక్ష్మ ప్రణాళిక తయారీపై శిక్షణ

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సూక్ష్మ ప్రణాళిక తయారీపై హెచ్‌ఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 శ్రీధర్ మాట్లాడుతూ హెచ్‌ఎంలు పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల భవనాలు ఇతరాత్ర వివరాలను ఈనెల 23లోపు సమర్పించాలని సూచించారు. ఆర్పీలు విజయ్‌కుమార్, చిన్నికృష్ణ, సీఆర్పీ గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి భజన మండలి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రోగులు, గర్భిణులకు అన్నదానం నిర్వహించారు.

న్యాయవాది మృతికి సంతాపం



బార్ అసోసియేషన్ క్లబ్‌లో సంతాపం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం: న్యాయవాది మాధవయ్య మృతికి హిందూపురం బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాధవయ్య సేవలు కొనియాడారు. అనంతరం ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి భార్య, కుమారుడిని పరామర్శించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి హిదాయతుల్లా, ఏపీపీ ఇందాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న బోధన కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు వెంకటరెడ్డి

హిందూపురం టౌన్: స్థాయిని బట్టి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని బోధన కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోధన అభ్యసన అభివృద్ధి కార్యక్రమ రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 9 మండలాల ఉన్నత పాఠశాలల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణను నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, అధికారులు హాజరుకావాలన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం అర్బన్: తూమకుంట చెక్‌పోస్టు వద్ద వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ క్లినిక్, కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 125 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సవీరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ , వైద్యులు రామునాయక్, రాజశేఖర్, కుశాల్ సంస్థ ప్రతినిధి రహీమ్, సిబ్బంది, గొల్లాపురం, తూమకుంట సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీ మల్లికార్జున

అగళి: బాలికల భద్రత సామాజిక బాధ్యత అని ఎంపీపీ రేణుక, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం ఆర్డీటీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా విద్యార్థులకు లఘు చిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. అనంతరం ఆర్డీటీ ఆర్డీ మాట్లాడుతూ తమ సంస్థ ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తోందన్నారు. ఆడపిల్లలకు 18, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112 సమాచారం అందివ్వాలవని సూచించారు.కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ, ఏటీఎల్ ఓబులేసు, సీఓ వెంకటేష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జానపద కళాకారులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న యక్షగాన కళాకారుడు గంగయ్య

పావగడ: జానపద కళాకారులను ప్రోత్సహించాలని స్థానిక యక్షగాన, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు టి గంగయ్య తెలిపారు. నాగలమడకలోని స్వామి వివేకానంద గ్రామీణ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కన్నడ రాజ్యోత్సవ మాసాచరణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలు, సంస్కృతిని పరిరక్షించే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. కసాప అధ్యక్షుడు కట్టా నరసింహ మూర్తి మాట్లాడుతూ మాతృభాష నేర్చుకుంటే అన్ని విషయాలు సులభంగా అర్థమవుతాయన్నారు. శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు అంతరగంగ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు న్యూట్రీషన్ కిట్ల అందజేత



న్యూట్రీషన్ కిట్లను అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం పవర్‌గ్రిడ్ సంస్థ వారు క్షయ బాధితులకు న్యూట్రీషన్ కిట్లను అందించారు. క్షయబాధితులకు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శశిరేఖ, డాక్టర్ దివాకర్, సూపర్‌వైజర్ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
, గర్భిణులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

హిందూపురం: హెచ్‌ఐవీ పట్ల అప్రమత్తంగా ఉంటూ అవగాహనతో చైతన్యవంతులు కావాలని డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ మారుతి అన్నారు. 37వ సచివాలయంలో హెచ్‌ఐవీపై చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ తిప్పేస్వామి, వార్డుకౌన్సిలర్ మహాలక్ష్మి, వార్డు సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'చేనేత కార్మికులను ఆదుకోవాలి'

సోమందేపల్లి: చేనేత కార్మికులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. శుక్రవారం స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మంటపంలో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. చేనేత రిజర్వేషన్ అమలు చేసి, చేనేత పరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ద్వారా రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణంతో పాటు కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట నారాయణ, సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి, నాయకులు వినోద్, చాంద్ బాషా, ఆంజనేయులు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రనల్లి'ని నివారించుకోండి

ధర్మవరం రూరల్: వరి పంటకు ఆశించిన ఎర్రనల్లి, దోమపోటు ఉధృతిని నివారించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సనావుల్లా రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో సాగు చేసిన వరి పొలాలను వ్యవసాయాధికారి ముస్తఫాతో కలిసి పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రత పరిస్థితుల కారణంగా ఎర్రనల్లి ఉధృతి ఎక్కువగా వున్నట్లు గుర్తించామన్నారు. వీటి నివారణకు ఎకరాకు స్పైరోమెసిఫెన్ 200 ఎం.ఎల్ లేదా 400 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలన్నారు. అదే విధంగా దోమపోట ఉన్న పొలాల్లో బుక్రోపోసిన్ 320 ఎంఎల్ ఒక ఎకరాకు లేదా పైమెట్రో జైన్ 120 గ్రాములు, లేదా పెక్సోలాన్ 110 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సహాయకుడు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి'



పుట్టపర్తిలో పాఠశాలలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులు బాగున్నాయి. పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని రాష్ట్ర నాడు-నేడు విభాగం క్వాలిటీ కంట్రోల్ ఈఈ శ్రీనివాసులు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. శుక్రవారం పుట్టపర్తిలో పలు పాఠశాలలను సందర్శించారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, గ్రానైట్ తదితర పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే మొదటి దశ నాడు-నేడు పనులు పూర్తి కాగా.. రెండో దశ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు మరుగుదొడ్లు లేవన్నారు. ప్రస్తుతం నాడు-నేడులో భాగంగా బడుల్లో అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా నాయకుడు రమణారెడ్డి, డీఈ రంగనాథరావు, ఏఈ బాబు, హెచ్‌ఎం రాధారాణి సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న జయసిహరాజు



తెలుగు కవుల గురించి వివరిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులతో కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు వివేకానందమూర్తి తెలుగు భాష ప్రాముఖ్యతను వివరిస్తూ, అష్ట దిగ్గజ కవుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మల్లికార్జున, ఉపాధ్యాయులు రత్నమయ్య,ఎర్రిస్వామి, సుధాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

లేపాక్షిలో కవి సమ్మేళనం

లేపాక్షి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రలోని గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి జయసింహరాజు తెలిపారు. కార్యక్రమంలో చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, చెన్నక్రిష్ణ, భూతరాజు, సుజాత, శ్రీదేవి, పాణి, ఇలియాస్ పాల్గొన్నారు. ఈ సంరదర్భంగా శ్రీకృష్ణదేవరాయల అస్థానంలో అష్ట దిగ్గజ కవుల సాహిత్యాన్ని వివరించారు.

అమరాపురం: గ్రంథాయవారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఇబ్రహీం ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కృష్ణారెడ్డి గ్రంథాలయ ప్రాముఖ్యతను తెలియజేశారు.

గుడిబండ: గ్రంథాయవారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీ పరీక్షలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కమలనాభరావు, ఉపాధ్యాయులు, పీడీ సాయికృష్ణ పాల్గొన్నారు.

తనిఖీ సభ్యులకు సహకరించండి

చిలమత్తూరు: ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేసే సిబ్బందికి ఉపాధి సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏడాదిగా జరిగిన ఉపాధి పనులపై గ్రామాల్లో తనిఖీ చేసి, అవకతవకను గుర్తిస్తారన్నారు.

కులగణన మాస్టర్ ట్రైనర్‌గా నరేష్‌కృష్ణ

చిలమత్తూరు: ప్రభుత్వం చేపట్టిన కులగణన మాస్టర్ ట్రైనర్‌గా ఎంపీడీఓ నరేష్ కృష్ణ నియమితులయ్యారు..ఈ మేరకు జిల్లాలో ఐదుగురు మాస్టర్ ట్రైనర్లు నియమితులు కాగా, ఈయన చిలమత్తూరుతో పాటు, హిందూపురం అర్బన్, రూరల్, పరిగి మండలాలకు చెందిన సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తారు. ఆయన మాట్లాడుతూ కులగణన బ్రిటీష్ పరిపాలనలో ఒకసారి జరిగిందని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు..దీనిపై ప్రజలెవ్వరూ అపోహలు పెంచుకోవద్దని, దీని వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. ప్రజలంతా సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

పావగడ: స్థానిక గురుభవన్‌లో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. బెంగళూరు కు చెందిన సప్తగిరి ఆస్పత్రి వైద్యులు 348 మందికి వైద్యపరీక్షలు చేసి 35 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ తెలిపారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి సప్తగిరి ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందించనున్నట్లు ఆయన తెలిపారు.

తుమ్మల మారెమ్మ ఆలయంలో విశేష పూజలు



అలంకరణలో తుమ్మల మారెమ్మ

గుడిబండ: పట్టణ సమీపాన వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో కార్తీక శుక్రవారం కావడంతో ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని జిల్లేడుగుంట ఆంజనేయస్వామి, భక్తర పల్లి నరసింహస్వామి, మెట్టబండ ఆంజనేయస్వామి, చెందకచెర్లు అంజినేయస్వామి ,లక్ష్మీనిమామిడమ్మ, వీరకేతమ్మ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కొల్హాపురి మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళహారతి ఇచ్చారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దాతల సహకారంతో ఆలయ ప్రధాన అర్చకుడు అన్నదానం ఏర్పాటు చేశారు.

రహదారి పక్కన పొంచి ఉన్న ప్రమాదం!



జాతీయ రహదారిపై ఏర్పడిన మట్టిదిబ్బలు

పెనుకొండ రూరూల్: పెనుకొండ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఇసుక పేరుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుకలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు చెప్తున్నారు.పెనుకొండ 44వ జాతీయ రహదారి, కియా ప్రధాన గేట్ నుంచి మొదలు కొని గుట్టూరు వరకు ఇసుక పేరుకుపోయింది.

తిరుమలకు పాదయాత్ర



వెంకన్న చిత్ర పటానికి పూజలు చేస్తున్న భక్తులు

పావగడ: స్థానిక శ్రీవారి గరుడ సేవా సమితికి చెందిన 12 మంది వేంకటేశ్వరస్వామి భక్తులు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తిరుమలకు కాలి నడకన శుక్రవారం ఉదయం పయనమయ్యారు. ఈ సందర్భంగా భక్త మండలి అధ్యక్షురాలు రత్నమ్మ మాట్లాడుతూ ఏటా కార్తీక మాసం ప్రారంభంలో స్వామి దర్శనానికి కాలి నడకన తిరుమలకు వెళ్తున్నామన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ విద్యుత్ సరఫరా పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి నుంచి సరఫరా అయ్యే శాసనకోట, ఎం.చెర్లోపల్లి, మోదా, శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి, పుట్టగూర్లపల్లి, కోనాపురం, గొరవనహళ్లి, కొడిగెనహళ్లి తదితర గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్‌ను మరమ్మతుల కారణంగా తాత్కాలికంగా నిలిపివేస్తున్నామన్నారు. సేవామందిరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సోమందేపల్లి: విద్యుత్ లైన్ మరమ్మతు చేస్తుండడంతో శనివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప తెలిపారు. సోమందేపల్లి, గుడిపల్లి, నాగినాయని చెరువు, మాగేచెరువు, చల్లాపల్లి పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.